క్లుప్తంగా

పెద్దాసుపత్రికి స్ట్రెచర్ల విరాళం



దాతలు ఇచ్చిన స్ట్రెచర్ల వద్ద ఆసుపత్రి అధికారులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు దాతలు ఐదు స్ట్రెచర్లను విరాళంగా ఇచ్చారు. మంగళవారం వాటిని సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు అందుకున్నారు. నగరంలోని విజయదుర్గ కార్డియాక్ సెంటర్ వారు రూ.50 వేలు విలువ చేసే స్ట్రెచర్లను విరాళంగా అందజేశారన్నారు. వీటిని ఆసుపత్రిలోని అత్యవసర విభాగాల్లో అందుబాటులో ఉంచుతామని చెప్పారు. అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ శివబాల నాగాంజన్ తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ సేవలు కీలకం



మాట్లాడుతున్న రిటైర్డ్ డీఎస్పీ మహబూబ్ బాషా

కర్నూలు (హాస్పిటల్): రోగులకు అందించే వైద్య చికిత్సల్లో నర్సింగ్ సేవలు కీలకమని ఆయత్ ఫౌండేషన్ అధ్యక్షుడు, రిటైర్డ్ డీఎస్పీ మహబూబ్ బాషా అన్నారు. మంగళవారం స్థానిక సీతారాం నర్సింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన ల్యాంప్ లైటింగ్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. దేశానికి రైతు, జవాన్ ఎంత ముఖ్యమో వైద్య రంగంలో వివిధ కోర్సులు చదువుతున్న విద్యార్థులు అంతే ముఖ్యమన్నారు. నర్సింగ్ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులే రేపటి ప్రాణదాతలని చెప్పారు. ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ మంజులా వాణి మాట్లాడుతూ.. అమ్మాయిలతో సమానంగా అబ్బాయిలు కూడా నర్సింగ్ విద్యను అభ్యసించడానికి ముందుకు రావడం హర్షణీయమన్నారు. నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి, ప్రిన్సిపాల్ వినోదిని, కాలేజీ చైర్మన్ సీతమ్మ, ప్రిన్సిపాల్ విజయ రాఘవేంద్ర గౌడు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

కల్లూరు: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నగర అధ్యక్ష, కార్యదర్శులు కె.సుధాకరప్ప, ఆర్.నరసింహులు డిమాండ్ చేశారు. మంగళవారం కల్లూరులోని సూర్యనారాయణ భవన్‌లో శరీన్‌నగర్ మట్టి పని కార్మికుల సమావేశం యేసు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమాన్ని మరిచి పాత చట్టాలను మార్పు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకు రావడం వల్ల కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నాయన్నారు. ఏప్రిల్ 12, 13, 14 తేదీల్లో సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు కర్నూలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో వెంకటరాముడు, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, ఈశ్వరమ్మ, సరోజమ్మ, మరియమ్మ, ఎల్లమ్మ, సోమేశ్వరి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదివితే సత్ఫలితాలు



విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న డీఈఓ శామ్యూల్

చిప్పగిరి: ఏకాగ్రత తో చదివితే సత్ఫలితాలు వస్తాయని డీఈఓ శామ్యూల్ విద్యార్థులకు సూచించారు. మంగళవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ తన మాతృమూర్తి స్వగ్రామం చిప్పగిరి అని, అందుకే తనకు సొంత ఊరి లాంటిదన్నారు. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచే విద్యార్థులకు బహుమతులు అందిస్తానని హామీ ఇచ్చారు. పరీక్షల రాస్తున్న విద్యార్థులకు పెన్నులు, ప్యాడ్, జామెట్రీ బాక్స్ తదితరాలు తన సొంత ఖర్చులతో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి, సావిత్రమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీలో మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని వర్సిటీ వీసీ బసవరావుకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ.. ఆర్‌యూ ప్రాంగణంలో సామాజిక ఉద్యమ కారులైన మహాత్మా జ్యోతిరావు పూలే, మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ లాంటి మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

అవగాహన



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ

కర్నూలు (హాస్పిటల్): చూపును నిశబ్దంగా తినేసే గ్లకోమా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళ చెప్పారు. ప్రపంచ గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా ఆమె మంగళవారం తన ఛాంబర్‌లో గ్లకోమా అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ కంటి అద్దాలను తరచూ మార్చాల్సి రావడం, మసక వెలుతురులో వస్తువులను గుర్తించలేకపోవడం, లైట్ల చుట్టూ రంగుల వలయాలు కనిపించడం వంటి లక్షణాలు ఉన్నట్లయితే ప్రాథమిక దశలోనే చికిత్స తీసుకుంటే కంటి చూపును కాపాడుకోవచ్చన్నారు. ఆలస్యం చేసేకొద్దీ పూర్తిగా చూపు కోల్పోయే ప్రమాదముందని తెలిపారు. ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు పారామెడికల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్ల ద్వారా ప్రజలకు గ్లకోమా గురించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. డీపీఎంఓ డాక్టర్ ఉమ, జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ సంధ్యారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన



ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టిన సీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఆరోగ్యశ్రీ వ్యయానికి అదనంగా డబ్బు వసూలు చేస్తున్న మెడికవర్ ఆస్పత్రిని తక్షణమే సీజ్ చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. ఆరోగ్యశ్రీ కింద తక్కువ సొమ్ము వస్తుందని, మిగతా సొమ్మును మీరే భరించాలని అదనపు వసూళ్లు చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆరోపించారు. మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో మెడికవర్ హాస్పిటల్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ ఆసుపత్రికి వస్తే డబ్బులు కట్టి శవాలను తీసుకెళ్లాల్సి వస్తోందన్నారు. యాజమాన్యం డబ్బులకోసం రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని, వివిధ పరీక్షల పేరుతో వేలల్లో బిల్లులు వేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆసుపత్రిలో చనిపోయిన రోగుల చికిత్సలపై విచారణ చేయాలని, చనిపోయిన ప్రతి రోగికి రూ.30 లక్షలను యాజమాన్యం చెల్లించేలా చూడాలని డిమాండ్ చేశారు. నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, శ్రీనివాసరావు, అన్వర్, నాగరాజు, నల్లన్న, కుమార్‌రాజా పాల్గొన్నారు.

ఆవేదన



నిరసన తెలుపుతున్న హెల్త్ సెక్రటరీలు

కర్నూలు(హాస్పిటల్): గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న హెల్త్ సెక్రటరీలకు గ్రేడ్–3 పదోన్నతులు కల్పించాలని హెల్త్ సెక్రటరీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సంధ్యారాణి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.నిర్మల, జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద హెల్త్ సెక్రటరీలు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. పదోన్నతుల కోసం గత నెల రోజులుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు.వైఎస్సార్ జిల్లాలో ప్రమోషన్లు ఇచ్చినప్పటికీ మిగిలిన జిల్లాల్లో ఇవ్వకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమోషన్ల ప్రక్రియ వెంటనే చేపట్టాలని కోరారు. అనంతరం డీఎంహెచ్ఓ డాక్టర్ పి.శాంతికళకు వినతి పత్రం ఇచ్చారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి జె.నాగేశ్వరరావు, హెల్త్ సెక్రటరీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు మహేశ్వరి, వెంకటేశ్వరమ్మ, గౌరి పాల్గొన్నారు.


రహదారి పనుల అడ్డగింత



ట్రాక్టరును అడ్డుకొని నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

కర్నూలు (టౌన్): తుంగభద్ర నది సమీపంలోని రోజా కాలనీకి చెందిన దళితులు మంగళవారం రహదారి పనులను అడ్డుకున్నారు. అత్యధికంగా పేదలు నివసించే ఈ కాలనీవాసులు నది వెంట పచ్చగడ్డి పెంచి పశువుల వ్యాపారులకు అమ్ముకొని జీవనం సాగిస్తున్నారు. అయితే ఇటీవల నగరపాలక సంస్థ అధికారులు ఇక్కడ రహదారి పనుల కోసం వ్యర్థాలను తీసుకువచ్చి వేస్తుండటంతో స్థానికులు రామేశ్వరీ, బీసమ్మ, మద్దమ్మ, లలితమ్మ తదితరులు ఘటనా స్థలంలో ట్రాక్టర్‌ను అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 50 సంవత్సరాలుగా తమ కుటుంబాలు తుంగభద్ర నది వెంట పచ్చగడ్డి పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నాయన్నారు. మున్సిపల్ అధికారులు ఇక్కడ రహదారి వేసేందుకు చర్యలు చేపట్టారన్నారు. దీన్ని నిరసిస్తూ ఇప్పటికే జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

యథేచ్ఛగా ఎర్రమట్టి తరలింపు



ఎర్రమట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ ఆవరణలోని ఇండోర్ స్టేడియం లైఫ్ సైన్సెస్ బిల్డింగ్స్ పక్కనున్న స్థలం నుంచి యథేచ్ఛగా ఎర్రమట్టి తరలింపు తీవ్ర చర్చనీయాంశమైంది. వర్సిటీలోకి ఇసుకను తీసుకొస్తున్న ట్రాక్టర్లు అన్‌లోడ్ చేసి వెళ్లేటప్పుడు ఎర్రమట్టి, ఎర్ర మొరుసును ప్రధాన ద్వారం నుంచి తరలిస్తుండటం గమనార్హం. వర్సిటీ ఉద్యోగుల అండదండలతోనే గత రెండు రోజుల్లో పదుల సంఖ్యలో తరలించినట్లు వర్సిటీలో చర్చ జరుగుతోంది. ఈ విషయమై రిజిస్ట్రార్ డాక్టర్ విజయకుమార్ నాయుడు మాట్లాడుతూ ఇదంతా అవాస్తమని పేర్కొన్నారు. పిల్లర్ల కోసం తవ్విన ఎర్ర మట్టిని వారిదే అనుకొని తరలిస్తుండగా సెక్యూరిటీ గుర్తించి సమాచారం ఇవ్వడంతో వెనక్కి పిలిపించామని చెప్పారు.

అన్న క్యాంటీన్లను పక్కాగా నిర్వహించాలి



అన్న క్యాంటీన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని అన్న క్యాంటీన్ల నిర్వహణ పక్కాగా ఉండాలని కమిషనర్ ఎస్. రవీంద్రబాబు ఆదేశించారు. ఆయన మంగళవారం స్థానిక సెట్కూర్ కార్యాలయం వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. అల్పాహారం రుచిపై ప్రజలను అడిగి ఆరా తీశారు. టోకెన్ల జారీ, ఆహారం వడ్డింపు, స్వచ్ఛత, తాగునీటి వసతిపై నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు నగర శివారులోని జగన్నాథగట్టు టిడ్కో ఇళ్లను కమిషనర్ పరిశీలించారు. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా సహకారంతో నర్సరీ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించి ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడారు. అలాగే బంగారుపేట, కొత్తబస్టాండ్, ఆనంద్ థియేటర్ కూడలి ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. మున్సిపల్ ఎస్ఈ రాజశేఖర్, ఎంఈ సత్యనారాయణ, డీఈఈలు గంగాధర్, శ్రీనివాసరెడ్డి, ఏఈ నాగజ్యోతి పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీ చెన్నమాధవస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నెకల్ సురేందర్‌రెడ్డి, నాయకులు

దేవనకొండ: మండలంలోని తెర్నెకల్ గ్రామంలో వెలిసిన లక్ష్మీచెన్నమాధవస్వామి రథోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. వేలాది మంది భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు. ఉదయం నుంచి స్వామివారికి జలాభిషేకం, కుంకుమార్చ, పంచామృతాభిషేకం తదితర విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నెకల్ సురేందర్‌రెడ్డి పాల్గొని స్వామివారికి పూజలు చేపట్టారు. సాయంత్రం భక్తుల జయజయ ధ్వనుల మధ్య రథ చక్రాలు ముందుకు కదిలాయి. కార్యక్రమంలో సర్పంచ్ అరుణ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు లుమాంబ, రాజన్న, రామిరెడ్డి, శేషాద్రిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా తరావీహ్



తరావీహ్ ప్రార్థన చేస్తున్న ముస్లింలు

కర్నూలు(అర్బన్): పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని స్థానిక హజ్రత్ లతీఫ్ లౌబాలి (రహ్మత్ ఉల్లాహి అలైహి) దర్గా, మసీదులో మూడు రోజుల పాటు నిర్వహించిన తరావీహ్‌ను విజయవంతంగా పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభమైన మూడు రోజుల తరావీహ్ ప్రార్థనలు సయ్యద్ షా అబ్దుల్ లతీఫ్ లౌబాలి అలియాస్ హుస్సయినీ పీర్ సాహెబ్ పర్యవేక్షణలో తరావీహ్‌ను పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ పవిత్ర తరావీహ్‌లో ఖురాన్ అకాడమీ వ్యవస్థాపకులు డాక్టర్ సయ్యద్ రిజ్వాన్ పాషా ఖాద్రీ సంపూర్ణ ఖురాన్‌ను తిలావత్ చేశారన్నారు. ఈ ప్రత్యేక ప్రార్థనలకు అనేక మంది ముస్లింలు హాజరై ఖురాన్ తిలావత్ చేస్తు ప్రత్యేక దువాలను చేశారన్నారు. భక్తులు డాక్టర్ సయ్యద్ రిజ్వాన్ పాషా ఖాద్రీని ఘనంగా సన్మానించారు. మత పెద్దలు నజీర్ అహమ్మద్, మసీహ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంపై మంత్రి దిగ్భ్రాంతి

కర్నూలు (సెంట్రల్): జిల్లాలో ఆదోని మండలం పాండవగల్లు వద్ద జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

'సూపర్ సిక్స్' వెంటనే అమలు చేయాలి

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎస్.అలివేలు డిమాండ్ చేశారు. మంగళవారం 37వ వార్డు పరిధిలోని నేతాజీ హౌసింగ్ కాలనీలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబునాయుడు ఎన్నికల్లో మహిళలకు ఎన్నో హామీలు ఇచ్చి మోసం చేశారన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, ప్రతి మహిళకు నెలకు రూ.1500 సాయం, తల్లికి వందనం పథకాలను ఎప్పుడు అమలుచేస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో పద్మావతి, గోవర్ధనమ్మ, రేవతి, కళావతమ్మ పాల్గొన్నారు.

శంభాజీ చరిత్రను వెలుగులోకి తేవాలి

కర్నూలు(అర్బన్): ఛత్రపతి శంభాజీ మహారాజ్ చరిత్రను వెలుగులోకి తీసుకురావాలని బీసీ రిజర్వేషన్ల పోరాట సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీకాంతయ్య అన్నారు. మంగళవారం శంభాజీ మహారాజ్ వర్ధంతి సందర్భంగా స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశం కోసం, ధర్మం కోసం పోరాడిన గొప్ప మరాఠా యోధుడు ఛత్రపతి శంభాజీ మహారాజ్ అన్నారు. ఆయన చరిత్రను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి పాఠ్యాంశాల్లో చేర్చాలన్నారు. జాతీయ అధ్యక్షుడు కేపీ అభిరామ్ మాట్లాడారు. బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవపూజ ధనుంజయ ఆచారి, బీసీ యువజన సంఘం అధ్యక్షులు వాల్మీకి బాలకృష్ణ, సంస్కృత ఉపాధ్యాయులు దేరంగుల సర్వేశ్వరబాబు తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

దేవనకొండ: మండల కేంద్రం సమీపంలో ఈనెల 8న పురుగు మందు తాగిన పింజారి వాహిద్(24) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం రాత్రి మృతి చెందాడు. పెద్దకడబూరు మండలం తారాపురం గ్రామానికి చెందిన చాంద్‌బీతో వాహిద్‌కు కొన్నేళ్ల క్రితం వివాహమయ్యింది. అయితే కుటుంబ కలహాల వల్ల చాంద్‌బీ ఈనెల 3న నందవరం గ్రామంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీంతో భార్య పుట్టింటి వారు అతనిపై కేసు పెట్టారు. అప్పటి నుంచి భార్య బంధువులు ఏమైనా చేస్తారేమోనని భయపడుతూ దేవనకొండ గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చి తల దాచుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో ఈనెల 8న స్వగ్రామానికి వెళ్తూ దేవనకొండ టరినింగ్ వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబసభ్యులు కర్నూలు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేకపోయాడు. మృతుడి తండ్రి ఖాజాహుసేన్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ వంశీనాథ్ తెలిపాడు.

బాల్యవివాహాన్ని అడ్డుకున్న పోలీసులు

హాలహర్వి: మండలంలోని జె.హొసళ్లి గ్రామంలో మంగళవారం హాలహర్వి పోలీసులు బాల్యవివాహాన్ని అడ్డుకున్నారు. జె.హొసళ్లి గ్రామానికి చెందిన బాలిక గూళ్యం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరతి చదువుతోంది. అయితే కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగోలేక తల్లిదండ్రులు బడి మాన్పించి, పెళ్లి చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆలూరు మండలం అరికెర గ్రామానికి చెందిన ఓ యువకుడితో పెళ్లి నిశ్చయం చేశారు. రెండు రోజుల్లో పెళ్లి జరగనుంది. అయితే అధికారులు వారం క్రితమే బాలిక తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అయినా వారు ఎవరికి తెలియకుండా పెళ్లి చేయాలని ఏర్పాట్లు చేశారు. విషయం తెలుసుకున్న హాలహర్వి ఎస్ఐ చంద్ర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు చందన, చంద్రావతి గ్రామానికి వెళ్లి బాల్యవివాహాన్ని అడ్డుకున్నారు. తల్లిదండ్రులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాలికకు 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే పెళ్లి చేయాలని సూచించారు.

యూత్ పార్లమెంట్‌కు రిజిస్ట్రేషన్ చేసుకోండి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఆర్‌యూ వీసీ తదితరులు

కర్నూలు కల్చరల్: యూత్ పార్లమెంట్‌లో పాల్గొనడం వల్ల ప్రజాస్వామ్య వ్యవస్థలతో పాటు రాజ్యాంగానికి సంబంధించిన విషయాల పట్ల యువతకు అవగాహన కలుగుతుందని ఆర్‌యూ వీసీ వి.వి.బసవరావు అన్నారు. భారత ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖతో పాటు ఆర్‌యూ ఎన్ఎస్ఎస్ విభాగం, సెయింట్ జోసఫ్ కళాశాల సంయుక్త నిర్వహణలో జరిగే వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమం రిజిస్ట్రేషన్లకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం వీసీ ఛాంబర్‌లో ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ.. ఒకే దేశం ఒకే ఎన్నికలు అనే అంశంపై జరిగే యూత్ పార్లమెంట్‌లో పాల్గొనేందుకు 18 నుంచి 25 సంవత్సరాల్లోపు వయసు గల యువత అర్హులన్నారు. ఆసక్తి గల యువత https://mybharath.gov.i n వెబ్‌సైట్‌లో ఈ నెల 16వ తేదీలోగా పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో ఈ అంశానికి సంబంధించి ఒక నిమిషానికి తక్కువ కాకుండా వీడియోను తెలుగు, హిందీ, ఇంగ్లిష్‌లో రూపొందించి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమానికి ఎంపికైన విద్యార్థుల వివరాలు ఆయా కళాశాలలతో పాటు విద్యార్థులకు తెలపడం జరుగుతందన్నారు. రెక్టార్ ఎన్‌కేటీ నాయక్, రిజిస్ట్రార్ విజయకుమార్ నాయుడు, నాగరాజు, వెంకటరత్నం, విజయుడు, నాగచంద్రుడు, శివప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి



రైతు సభ్యత్వ నమోదు చేసుకుంటున్న దృశ్యం

కల్లూరు: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం డిమాండ్ చేశారు. మంగళవారం చిన్న టేకూరులో రైతు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. దేశానికి వెన్నుముక రైతు, వ్యవసాయమే అన్నారు. రైతులు సంతోషంగా ఉండాలంటే పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి, రుణామాఫీ చేయాలన్నారు. వాతావరణ మార్పుల వల్ల పంటల దిగుబడులు అంతంత మాత్రమే ఉన్నాయన్నారు. పంట దిగుబడులను అమ్ముదామంటే మద్దతు ధరకు కొనే నాథుడే లేడన్నారు. ఈ పరిస్థితుల్లో రైతులు బ్యాంకు రుణాలు, వడ్డీ చెల్లించాలంటే తలకు మించిన భారం అవుతుందన్నారు. బ్యాంకు అధికారులు రుణాలను రెన్యూవల్ చేయాలన్నారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, నాయకులు పుల్లన్న, మహమ్మద్ బాష, గోపాలు, మహిళా రైతులు తదతరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్
- హొళగుంద పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



మార్లమడికి చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్ సిబ్బందిని విచారిస్తున్న జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

హొళగుంద: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఒక సారి డబ్బు వెళ్లిందంటే తిరిగి రావడం కష్టమని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. మంగళవారం ఆయన హొళగుంద పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు వివిధ నేరాలకు సంబంధించి కేసుల రికార్డులను పరిశీలించారు. మండలంలో నేరాలు, పెండింగ్ కేసులు తదితరతో పాటు సిబ్బంది పనితీరు గురించి ఎస్ఐ బాల నరసింహులును అడిగి తెలుసుకున్నారు. 'నేను- సైబర్ స్మార్ట్' అనే కార్యక్రమం ద్వారా ప్రజలు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. పోలీసులను ఆశ్రయించే బాధితుల పట్ల మర్యాద పూర్వకంగా నడుచుకోవాలన్నారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ అసంఘిక కార్యకలాపాలు, ఇతర నేర సమాచారాలను పోలీసుల దృష్టికి తీసుకొచ్చి శాంతిభద్రతలు కాపాడేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు తనిఖీ

ఆంధ్రా–కర్ణాటక సరిహద్దులోని మార్లమడికి వద్ద ఉన్న అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును మంగళవారం సాయంత్రం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆకస్మిక తనిఖీ చేసారు. కర్ణాటక మద్యం, ఇసుక అక్రమ రవాణను అరికట్టడానికి తీసుకుంటున్న చర్యలు గురించి అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అక్రమ రవాణను కట్టడి చేయడంలో నిర్లక్ష్యం వద్దని, ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని ఆదేశించారు. ఆయన వెంట ఆలూరు సీఐ వెంకట చలపతి, హొళగుంద ఎస్ఐ బాల నరసింహులు ఉన్నారు.

రేపు హోలీ వేడుకలు

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని దక్షిణ షిరిడీ సాయి బాబా దేవాలయంలో ఈనెల 13వ తేదీన హోలీ వేడుకలు నిర్వహించనున్నట్లు సాయి సంగ్ సేవక్ మహాబలేష్ తెలిపారు. సాయంత్రం 6.30 గంటలకు సంధ్య హారతి, 7 గంటలకు హోలీ దహనం, 8 గంటలకు పల్లకీ సేవ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సాయి భక్తులు వేడుకల్లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

జయప్రదం చేయండి



మాట్లాడుతున్న ఎండీ అంజిబాబు

కర్నూలు(సెంట్రల్): మార్చి 14వ తేదీన జరిగే విశాఖ ఉక్కు పరిరక్షణ ఆందోళనను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు పిలుపునిచ్చారు. మంగళవారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన కార్మిక సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.11 వేల కోట్ల ప్యాకేజీని వెంటనే ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం దొడ్డిదారిన విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేసే ప్రయత్నం చేస్తోందని, ఈ నేపథ్యంలో ప్యాకేజీని తక్షణమే అమలు చేయాలన్నారు. ఆందోళనలో భాగంగా కలెక్టరేట్ ఎదుట చేపట్టే కార్యక్రమంలో పెద్ద ఎత్తున కార్మిక సంఘాలు పాల్గొని విజయంతం చేయాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నాగన్న, సీఐటీయూ న్యూసిటీ కమిటీ కార్యదర్శి సాయిబాబా, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్ పాల్గొన్నారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



కర్నూలు(రూరల్): నగర శివారులోని వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పలువురు అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ చేసి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఉల్చాలలో పది పరీక్ష కేంద్రం ఏర్పాటు

కర్నూలు (రూరల్): మండల పరిధిలోని ఉల్చాల గ్రామంలో తొలిసారిగా పదవతరగతి పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో ఈ నెల 17 నుంచి ఉల్చాలతో పాటు రేమట, నిడ్జూరు, జి.సింగవరం పాఠశాలల విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు డిప్యూటీ డీఈఓ హనుమంతురావు తెలిపారు. ఉల్చాలలో కేంద్రం ఏర్పాటు ద్వారా సమీప గ్రామాల పదోతరగతి విద్యార్థులు కర్నూలు నగరానికి వచ్చి పరీక్ష రాసే అవస్థ తప్పిందని ఎంపీపీ డి .వెంకటేశ్వరమ్మ తెలిపారు. మంగళవారం ఆమె డిప్యూటీ డీఈఓతో సమావేశమై కృతజ్ఞతలు తెలిపారు.